క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు కృషి



అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న చైర్మన్

ఇబ్రహీంపట్నం రూరల్: పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తానని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి 8వ వార్డులో రూ.6 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీటి సరఫరా లాంటి వసతులు కల్పిస్తానని పేర్కొన్నారు. కౌన్సిలర్ గోపగళ్ల మహేందర్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, విష్ణుగౌడ్, రవీందర్ ముదిరాజ్, భిక్షపతిగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, నరహరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ఎస్‌ఐ వెంకటేశ్



ఆమనగల్లు: పట్టణంలోని కోర్టులో ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. చిన్నచిన్న తగాదాలు, యాక్సిడెంట్లు, భూ తగాదాలు, కొట్లాట కేసులు, చీటింగ్ తదితర కేసులను ఇరువర్గాలు మాట్లాడుకుని కోర్టులో రాజీపడవచ్చునని పేర్కొన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు వినియోగించుకుని, సమయం, డబ్బును ఆదా చేసుకోవాలని ఎస్‌ఐ కోరారు.

చెట్ల కొమ్మల నరికివేత



కొమ్మల తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం: రహదారికి ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను గురువారం మునిసిపల్ సిబ్బంది తొలగించారు. పట్నం పెద్ద చెరువు కట్టపై రోడ్డు, కింది రోడ్డుకు ఉన్న చెట్ల కొమ్మలు.. ఏపుగా పెరిగి రోడ్డుకు అడ్డుగా వస్తున్నాయి. ఇది వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఇదే విషయమై పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ బర్ల మంగ, కమిషనర్ రవీంద్రసాగర్‌లు కొమ్మలను తొలగింప చేశారు.

సీఎంను కలిసిన గుజ్జుల



సీఎం రేవంత్‌రెడ్డితో మహేశ్

తలకొండపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

నియామకం



నూతన సభ్యులతో చెన్నకేశవరెడ్డి, గోవర్ధన్ యాదవ్

యాచారం: పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా బి.తిరుమలేష్ గౌడ్ ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా తిరుమలేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, అసోసియేట్ అధ్యక్షుడిగా హరిప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా జయమ్మ, కార్యదర్శిగా శ్రావణ్, మహిళా కార్యదర్శిగా సాధనలను నియమించారు. నూతన కార్యవర్గానికి సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుర్రం చెన్నకేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తుక్కుగూడ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛదనం–పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఓటర్ జాబితాలో తప్పులు

ఏ వార్డు ప్రజల పేర్లు ఆ వార్డులోనే ఉండేలా చూడాలి

- జాబితాను పారదర్శకంగా రూపొందించాలి
- అధికారులకు నేతల అభిప్రాయాలు
- ముగిసిన ముసాయిదా సమీక్ష



కడ్తాల్: తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్: గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటరు జాబితాలో అనేక తప్పులు దొర్లాయని, జాబితాను సరిచేయాలని రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. గురువారం కడ్తాల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుజాత అధ్యక్షతన ఓటరు జాబితా అభ్యంతరాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీక్యానాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్య నాయక్‌లు మాట్లాడుతూ.. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు వేరువేరు వార్డుల్లో వచ్చాయని, వాటిని ఒకే దగ్గర ఉండేలా చూడాలని కోరారు. అంతే కాకుండా ఒకే గ్రామానికి చెందిన ఓటర్ల పేర్లు మరో గ్రామంలో వచ్చాయని, వాటిని వారివారి స్వగ్రామ జాబితాలో చేర్చాలని, లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు. మృతి చెందిన వారి పేర్లను తొలగించాలని పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా జాబితాను పారదర్శకంగా రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ముంతాజ్, ఎంపీఓ విజయ్‌కుమార్ పాల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు పుష్ప, జహంగీర్‌అలీ, జహంగీర్‌బాబా, భగీరథ్, మహేశ్, రామకృష్ణ, రాజేందర్, నరేశ్, సుమన్, రవి, వినోద్, సుమన్ తదితరులు ఉన్నారు.

ప్రక్షాళన చేయాలి

అధికారుల సమీక్ష అనంతరం వార్డుల వారీగా ఓటరు లిస్టును ప్రక్షాళన చేయాలని కోరుతూ రాజకీయ పార్టీల నాయకులు తహసీల్దార్ షేక్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాతకు వినతిప్రతం అందజేశారు. ఓటరు జాబితా సవరణ గడువును పొడగించాలని, తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలని కోరారు. ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వారి పేర్లను తొలగించాలని పేర్కొన్నారు.

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం



ఆమనగల్లు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఓటరు లిస్టు ముసాయిదాపై వచ్చిన అభ్యంతరాలను ఉన్నతాధికారులకు విన్నవిస్తామని ఆమనగల్లు ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఓటరు లిస్టుపై పలువురు నేతలు తమ అభ్యంతరాలను విన్నవించారు. మార్పులు చేర్పులు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ముసాయిదాపై 218 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ లలిత, ఎంపీఓ వినోద, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు

తప్పులను సరిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

యాచారం: 'ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయి. కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే వార్డులో లేవు. తదితర సమస్యలను గుర్తించి సరి చేయాలి' అని వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు ఎంపీడీఓ నరేందర్‌రెడ్డికి విన్నవించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ జాబితా సవరణపై అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు తమ అభ్యంతరాలను తెలిపారు. ప్రతి ఓటును ఆధార్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. నాయకులు రవీందర్, రమేష్‌గౌడ్, నర్సింహ, నాయకులు వెంకట్‌రెడ్డి, అరవింద్‌నాయక్, నడుకుడి కృష్ణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

21 వరకు ఫిర్యాదుల స్వీకరణ



సమావేశంలో ఎంపీడీఓ, నాయకులు

తలకొండపల్లి: గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ నెల 13న ప్రచురించిన ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఇందులో ఎంపీఓ రఘు, మాజీ సర్పంచ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ అనిల్, బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు పాండు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్

- విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయుల కృషి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- ఎంఈఓ సర్దార్ నాయక్‌కు వీడ్కోలు



ఎంఈఓ సర్దార్ నాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మితమై ఉంటుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారంటే, వారి వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో దాగి ఉందని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఎంఈఓ సర్దార్ నాయక్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, సమాజంలో వారికి ఎంతో గౌరవం ఉందన్నారు. దేశ భవిష్యత్తు నిర్ణయించే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణిస్తున్నారంటే అది టీచర్ల కృషేనని పేర్కొన్నారు. మీపై బాధ్యత చాలా ఉందని, సమయానుకూలంగా పాఠశాలలకు హాజరై విద్యా బోధన చేయాలని ఎంఈఓకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎంఈఓను ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నేత రేణురెడ్డి, కృష్ణ, హెచ్‌ఎంలు రామనాథం, అంజయ్య, బాలకృష్ణ, వెంకటయ్య, శ్రీశైలం, మల్లేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్–ఉన్–నబీ



తలకొండపల్లి: వెల్జాల్‌లో ముస్లింల ర్యాలీ

- దైవమార్గం అనుసరణీయం
- మసీద్ కమిటీల అధ్యక్షులు



ఆమనగల్లు: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆమనగల్లు: మిలాద్–ఉన్–నబీ సందర్భంగా గురువారం జామై మసీదు కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూం ఆధ్వర్యంలో సీఐ ప్రమోద్‌కుమార్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మసీదు ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్, వివిధ మసీదు కమిటీల అధ్యక్షులు మసూం, గౌస్‌మొయినొద్దీన్, ఖాదర్‌ఖాద్రి, నాయకులు జబ్బార్, సయ్యద్ ఖలీల్, అఫ్జల్, నయీం, అక్రం, బాబా, అమీర్‌పాషా, రవూఫ్, అహ్మద్, మూసా, ఇస్మాయిల్, అసద్, ఫిరోజ్, అక్బర్, ఇమ్రాన్, సోహెబ్, సమీర్, జునైద్, ఫైసల్, అర్బాత్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మహ్మద్ ప్రవక్త చూపిన మార్గమే అనుసరణీయమని మసీద్ ఇమామ్ ఇంతియాజ్ ఖాద్రి అన్నారు. మండల పరిధి వెల్జాల్‌లో జామై మసీదు కమిటీ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్–ఉన్–నబీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా ర్యాలీ తీశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ సయ్యద్, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ముజిబర్ రెహమాన్, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, ఆరీఫ్, సమద్, గులాం, హుస్సేన్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ దివస్ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జగన్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ డా.జగన్ మాట్లాడుతూ భావవ్యక్తీకరణకు సులభమైన మాధ్యమంగా హిందీ భాషని పేర్కొన్నారు. హిందీ విశిష్టతను, తద్వార ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, హిందీ విభాగం అధిపతి డా.మాధవి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థుల పాల్గొన్నారు.

బడి ఆవరణలో మందుబాబుల విందు



బడి ఆవరణలో బీరు సీసాలు

తలకొండపల్లి: పాఠశాల ఆవరణలో మందు బాబులు విందు చేసుకుంటున్నారు. అంతటితో ఆగకుండా ఖాళీ సీసాలు, తినుబండారాలను అక్కడే పడేసి ఆవరణను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. మండల పరిధి చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొందరు ప్రతి రోజు రాత్రి వేళలో మందు పార్టీ చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తాగిన మైకంలో ఖాళీ సీసాలను అక్కడే పడేయడంతో పాటు కొన్నింటిని పగలకొడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మందు బాబుల ఆగడాలను అరికట్టాలని కోరారు.

నిమజ్జన ఏర్పాట్లపై హర్షం

మీర్‌పేట: మీర్‌పేట మంత్రాల చెరువులో గణేశ్ నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహించినందున గురువారం ఎమ్మెల్యే సబితారెడ్డి క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చెరువు వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం, సిబ్బంది ఏర్పాట్లు చేయడంపై హర్షం వ్యక్తంచేశారు.

ప్రజాపాలన పేరుతో నియంత పాలన

- ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం
- జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్ నాయక్

కడ్తాల్: ప్రజా సమస్యలపై పోరాడే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతును నొక్కుతుందని విమర్శించారు. రుణమాఫీ కాని రైతులు ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, నాయకులు పత్యానాయక్, రమేశ్‌నాయక్, చందులను పోలీసులు ముందస్తు అరెస్టుచేసి, ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా జర్పుల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తుందని ఆరోపించారు. అసమర్థ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో సర్కారుకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

ఆమనగల్లు: రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిపొందని రైతులు ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు పలువురు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ ఎంపీటీసీలు కుమార్, పంతునాయక్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు నిరంజన్‌గౌడ్, బాలస్వామి, సయ్యద్ ఖలీల్, రమేశ్, శివకుమార్, వడ్డె వెంకటేశ్, జంగయ్య, రమేశ్, యాదయ్య, ఆనంద్, దేవేందర్, గణేశ్, తిరుపతి తదితరులు ఉన్నారు.



కడ్తాల్: పోలీసుల అదుపులో దశరథ్ తదితరులు



ఆమనగల్లులో బీఆర్‌ఎస్ నాయకులు



తలకొండపల్లి: వెల్జాల్‌లో..



కడ్తాల్: పూజా కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు

ఘనంగా గణపయ్యకు పూజలు

- కొనసాగిన గణనాథుల నిమజ్జనోత్సవం
- లడ్డూ వేలంలో భక్తుల పోటాపోటీ

ఇబ్రహీంపట్నం: చవితి వేడుకల్లో భాగంగా పట్నంలోని శ్రీరాంనగర్‌కాలనీలో జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన 20 ఫీట్ల భారీ వినాయకుడు రోజు వారిగా విశేష పూజలు అందుకుంటున్నాడు. 25 ఏళ్లగా ఉత్సవాలు నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు.. 13 రోజులుగా లంబోదరుడికి ప్రత్యేక పూజలతో పాటు.. వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వ్యాసరచన, తెలుగు పద్యాలు, ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు. గణనాథుడిని శుక్రవారం నిమజ్జనం చేయనున్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: చవితి వేడుకల్లో భాగంగా గణనాథులకు భక్తులు భక్తిశ్రద్ధలో పూజలు చేశారు. మండల కేంద్రంలోని స్కైబ్లూ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ గణేశ్ మండపం వద్ద భక్తులు శాంతమ్మ జంగయ్య దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. గణనాథుడిని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ తదితరులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో చంటి, రాజేశ్, మహేశ్, శివ, లాయక్‌అలీ, గణేశ్, సురేశ్, చంద్రదేవ్, కుమార్, తరుణ్, శక్తిరాం, శ్రీకాంత్, శ్రీనివాస్, విఘ్నేశ్, రాజు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

నిమజ్జనోత్సవం

ఆమనగల్లు: చవితి వేడుకల్లో భాగంగా గణనాథులను ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గుర్రంగుట్ట వద్ద యువసేన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడి చేతిలోని లడ్డూను వేలం వేయగా.. సురేందర్‌గౌడ్ రూ.50 వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం డప్పుచప్పుళ్లతో శోభాయాత్రగా శివపుత్రుడను గంగమ్మ చెంతకు చేర్చారు. కార్యక్రమంలో నాయకులు గంగారవీందర్‌గౌడ్, శ్రీకాంత్‌సింగ్, పూసల సత్యం, వడ్డె శివ, సైదులు, కొమ్ము ప్రసాద్, బాలు, గణేశ్, తిరుపతయ్య, శ్రీను, కొండల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ అ'ధర'హో..



లడ్డూతో రాజు కుటుంబ సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో కుర్మసంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడి లడ్డూకు మహా క్రేజీ ఏర్పడింది. గురువారం లంబోదరుడి చేతిలోని లడ్డూను వేలం వేయగా.. ఆ సంఘం అధ్యక్షుడు బండరాజు రూ.2.46 లక్షలకు సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా భక్తుడి కుటుంబ సభ్యులను సంఘం నాయకులు, పెద్దలు ఘనంగా సన్మానించారు.



కడ్తాల్: అన్నదానం చేస్తున్న నాయకులు



ఆమనగల్లు: లడ్డూను దక్కించుకున్న భక్తులు



ఇబ్రహీంపట్నంలో.. భజన పోటీలు

పర్యావరణాన్ని పరిరక్షిస్తాం..



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు గురువారం కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారంగా ఏర్పడి.. పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

పీసీసీ అధ్యక్షుడి సన్మానసభకు పట్నం నేతలు



పీసీసీ అధ్యక్షుడితో శేఖర్‌గౌడ్ తదితరులు

ఇబ్రహీంపట్నం: పీసీసీ నూతన అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు గురువారం నగరంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి.. ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్నం నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ సామాజిక వర్గానికి చెందిన బీసీ నేతను పీసీసీ అధ్యక్షుడిగా నియమించడం సంతోషకరమైన విషయమని అభివర్ణించారు. మహేశ్‌గౌడ్‌ను నియమించిన పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దేవగౌడ్, బాలశివుడుగౌడ్, జంగయ్యగౌడ్, యదగిరి, శ్రీహరి, కృష్ణ, ధన్‌రాజ్‌గౌడ్, తమ్మళ్ల కృష్ణ, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.